కొత్త అక్రెడిటేషన్లు జారీ చేయండి: టీయూడబ్ల్యూజే

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): జర్నలిస్టులకు కొత్త అక్రెడిటేషన్లు జారీచేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్(టీయూడబ్ల్యూజే) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు అల్లం నారాయణ సూచనల మేరకు రాష్ట్ర కమిటీ నాయకులు సోమవారం సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ హరీష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రతి రెండేళ్లకోసారి విధిగా జారీచేయాల్సి ఉండగా, ఆరు నెలలుగా కార్డుల జారీలో జాప్యం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ కారణాలతో రెండు దఫాలుగా గడువును పొడిగించారని, దీంతో మూడు నెలలకోసారి బస్‌పాస్‌లు తీసుకోవడం, కార్డులపై స్టిక్కర్లు అతికించుకోవడం జర్నలిస్టులకు ప్రహసంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్, ఉపాధ్యక్షుడు రమేశ్ హజారీ, టెంజు ప్రధాన కార్యదర్శి ఏ రమణకుమార్, కోశాధికారి యోగానంద్, ఐజేయూ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్ తదితరులున్నారు.

కార్యకర్తలను వేధిస్తే ఊరుకోం

- కేసీఆర్ మొక్క కాదు వేగు చుక్క
- రేవంత్‌రెడ్డి గురువులకే చుక్కలు చూపి రాష్ట్రాన్ని తెచ్చిన శక్తి కేసీఆర్
- కేంద్రప్రభుత్వంచేసే తప్పు జీఎస్టీ విధించడం దౌర్భాగ్యం
- రీయింబర్స్ చేస్తామన్న రాహుల్ హామీ ఏమైంది? : ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షగట్టి రాష్ట్ర ప్రభుత్వం కేసులు పెడుతున్నదని, తమ కార్యకర్తలను వేధిస్తే ఊరుకోబోమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కేసులకు వ్యతిరేకంగా కొట్లాడేందుకు పార్టీ పరంగా లీగల్ టీమ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో నిజాలను ప్రచారం చేసినా, ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపినా కాంగ్రెస్ సర్కార్ సహించడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎన్ని విమర్శలు చేసినా ఈ రకంగా వ్యవహరించలేదని గుర్తుచేశారు. సోమవారం కోరుట్ల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో హైదరాబాద్‌లోని తన నివాసంలో భేటీ అయ్యారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా పోటీపడి తిట్లు తిడుతున్నారని, కేసీఆర్ పాలనలో నిధులు వరదలై పారితే ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని ఎద్దేవాచేశారు. 'కేసీఆర్ మొక్క అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. కేసీఆర్ మొక్క కాదు.. ఒక వేగుచుక్క. రేవంత్‌రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణను సాధించిన శక్తి కేసీఆర్' అని తేల్చిచెప్పారు. తెలంగాణ ఉద్యమం నుంచీ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎన్నో కష్టాలకోర్చి పనిచేసిన చరిత్ర అని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా బీఆర్ఎస్ తట్టుకొని నిలబడిందని వివరించారు. ఇప్పుడూ అదే స్ఫూర్తితో పనిచేద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను, హామీలను విస్మరించిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు.

జీఎస్టీని రీయింబర్స్ చేయాలి

చేనేతపై పన్ను బ్రిటీష్ పాలనలో కూడా లేదని, అలాంటిది ప్రధాని మోదీ జీఎస్టీ విధించడం దౌర్భాగ్యమని కవిత మండిపడ్డారు. సోమవారం ఆమెను తన నివాసంలో అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు కలిశారు. కులగణనపై బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు నివేదిక అందించినందుకు కవితకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేనేతపై జీఎస్టీని రీయింబర్స్ చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించడం శోచనీయమని వాపోయారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేనేతపై కేంద్రం విధిస్తున్న జీఎస్టీని రీయింబర్స్ చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత పద్మశాలి సంఘ జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, అఖిలభారత పద్మశాలి సంఘం రాజకీయ జాతీయ అధ్యక్షుడు బొల్లా శివశంకర్, తెలంగాణ పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటక రూపక, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు గుర్రం శ్రవణ్, తెలంగాణ పద్మశాలి సంఘ రాజకీయ విభాగ ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రవళిక, రాష్ట్ర కార్యదర్శి జిల్లా నరేందర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు గణేశ్, రాష్ట్ర పద్మశాలి సంఘం యూత్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరప్రసాద్‌రెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

వరప్రసాద్‌రెడ్డికి తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారం

- వర్సిటీకి శాంతా బయోటెక్స్ కోటి విరాళం ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రముఖ పారిశ్రామికవేత్త, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డికి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసింది. సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవలందించినందుకు 2023వ సంవత్సరానికి వరప్రసాద్‌రెడ్డిని ఎంపిక చేసింది. బాచుపల్లిలోని నూతన క్యాంపస్‌లో సోమవారం జరిగిన వర్సిటీ 39వ వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

లక్ష స్వీకరించి.. కోటి విరాళం..

గుప్తదానాలు, దాతృత్వంలో ఎల్లప్పుడూ ముందుండే వరప్రసాద్‌రెడ్డి సోమవారం మరోసారి తన మనస్సును చాటుకున్నారు. విశిష్ట పురస్కారం కింద తెలుగు వర్సిటీ ఆయనకు రూ.లక్ష చెక్కు అందించగా, ఆ చెక్కును స్వీకరించిన వరప్రసాద్‌రెడ్డి అదే వేదికపై తెలుగు వర్సిటీకి రూ.కోటి విరాళాన్ని అందజేశారు. వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు తనకు అందించిన లక్షతోపాటు మరో కోటి చెక్కును మంత్రి అందించారు.

దళితబంధు రద్దుచేసే కుట్ర

- రాష్ట్రమంతా దళితబంధు ఇవ్వాలి
- దళితులను కేసీఆర్ ఆదుకుంటే రేవంత్ వారిని ముంచుతుండు
- హుజూరాబాద్‌లో దళితుల జోలికొస్తే జాగ్రత్త : పాడి కౌశిక్‌రెడ్డి

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో కేసీఆర్ దళితబంధు పథకం తీసుకొచ్చి వారి జీవితాలను బాగు చేస్తే, సీఎం రేవంత్‌రెడ్డి ఆ పథకాన్ని రద్దు చేసే కుట్రలు చేస్తున్నారని, ఏది మార్పో ప్రజలు, దళిత సంఘాలు ఆలోచించాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హుజూరాబాద్ దళితబంధు బాధితులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలట్ పద్ధతిన ఈ ప్రాజెక్టును నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి 18,500 మంది దళితులకు రూ.10 లక్షల చొప్పున వారి అకౌంట్లలో వేశారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 లక్షల కుటుంబాలకు దళితబంధు అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు తీసుకొస్తే, రేవంత్‌రెడ్డి ఆ పథకాన్ని రద్దు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే దళితబంధు అకౌంట్లను ఫ్రీజ్ చేశారని, ఏడాది పాలన పూర్తవుతున్నా దళితబంధు లబ్ధిదారులకు డబ్బు చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు అనే గొప్ప పథకంతో వర్కర్లు యాజమానులుగా మారారని, దళితబంధును ఆపిన దద్దమ్మ రేవంత్‌రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో దళితబంధు సాయాన్ని రూ.12 లక్షలకు పెంచుతామన్నారని, అది ఇవ్వకపోగా, ఇచ్చే రూ. 10 లక్షలను కూడా ఆపుతున్నారని మండిపడ్డారు.

దళితుల పక్షాన ధర్నాలు చేస్తే కేసులా?

నవంబర్ 8న దళితబంధు లబ్ధిదారుల పక్షాన ధర్నా చేస్తే కేసులు పెట్టడంపై కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకే ధర్నాపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని, పేదలు, దళిత మహిళలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. హుజూరాబాద్ ఏసీపీ అత్యంత దారుణంగా ప్రవర్తిస్తున్నారని, మహిళలను బూటు కాళ్లతో తన్నారని మండిపడ్డారు. 'ఇన్ని రోజులు ఓపిక పట్టా. ఇకపై సహించను. దళితులను పోలీస్ స్టేషన్‌కు అనవసరంగా పిలిపిస్తే ఊరుకునేది లేదు. పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తాం' అని హెచ్చరించారు. హుజూరాబాద్‌లో దళిత బిడ్డలపై జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలపై రాష్ట్రవ్యాప్తంగా దళితులు, దళిత సంఘాలు స్పందించాలని పిలుపునిచ్చారు. తన ప్రాణం పోయినా సరే దళిత బంధు వచ్చేదాకా పోరాడతానని తెలిపారు. హుజూరాబాద్‌లోని దళితులపై జరిగే అక్రమాలపై రాష్ట్ర, జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

రేపటి నుంచి జిల్లాల వారీగా జాగృతి సమావేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి నిర్ణయించింది. బుధవారం నుంచి ఆదివారం వరకు ఐదు రోజులపాటు ఉమ్మడి జిల్లాల సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలంగాణ జాగృతి సోమవారం వెల్లడించింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అధ్యక్షతన జరిగే సమావేశాల్లో డిసెంబర్ 4న ఉమ్మడి వరంగల్, నిజామాబాద్ జిల్లాలు, 5న కరీంనగర్, నల్గొండ, 6న రంగారెడ్డి, ఆదిలాబాద్, 7న హైదరాబాద్, ఖమ్మం, ఆదివారం మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల సమీక్ష నిర్వహిస్తారు.

వన్యప్రాణి సంరక్షణ బోర్డు పునరుద్ధరణ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వన్యప్రాణి సంరక్షణ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ముఖ్యమంత్రి చైర్మన్‌గా, అటవీశాఖ మంత్రి వైస్ చైర్మన్‌గా,చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌ను మెంబర్ సెక్రటరీగా నియమించింది.

మృత్యు శకటం

ఆలూర్ గేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

మొదటిపేజీ తరువాయి...

దామరిగిద్ద కృష్ణ(22), ఇంద్రారెడ్డినగర్‌కు చెందిన ఎస్ సుజాత(42) అక్కడికక్కడే మృతిచెందారు. వీరితో పాటు సెంట్రింగ్ పని మీద స్కూటీపై వచ్చి ఆలూరు వద్ద టీ తాగేందుకు ఆగిన టోలిచౌకికి చెందిన జమీల్(26)ను ఢీకొట్టడంతో అతను కూడా స్పాట్‌లోనే చనిపోయాడు. వీరితో పాటు ఇంద్రారెడ్డి నగర్‌కు చెందిన పద్మమ్మ, ఆలూరుకు చెందిన బాలమణి, అక్కడే జామకాయలు విక్రయిస్తున్న ఆంధ్రా ప్రాంతానికి చెందిన చల్లా మాల్యాద్రికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలు , క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదంలో బండ్లగూడకు చెందిన లారీ డ్రైవర్ అమీర్ క్యాబిన్ ఇరుక్కోవడంతో అతడికి రెండు కాళ్లు విరిగిపోయాయి. పోలీసులు బయటికి తీసి ఉస్మానియా దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న సబితారెడ్డి, బీఆర్ఎస్ యువనేత కార్తీక్‌రెడ్డితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. దవాఖానకు చేరుకుని గాయపడిన వారితో మాట్లాడి ప్రమాదం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హైవే విస్తరణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు:కార్తీక్‌రెడ్డి

బీజాపూర్ హైవే విస్తరణ పనులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి విమర్శించారు. సోమవారం చేవెళ్ల బీజాపూర్ రహదారి రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం చేవెళ్ల బీజాపూర్ రహదారి మీర్జాకూడా గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతికి ప్రభుత్వంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని చేవెళ్ల పోలీసు స్టేషన్లో సీఐ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అప్పా నుంచి మాన్నెగూడ వరకు 4లేన్ల రోడ్డు మంజూరై ఏడాదిన్నర అయినా పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు.

- బీఆర్ఎస్‌లోకి యూత్ కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సాయికిరణ్‌రావు, వివిధ జిల్లాలకు చెందిన నర్సింగ్‌రావు, పవన్‌కల్యాణ్, భరత్‌రావు, హర్షవర్ధన్‌రెడ్డి, సంజయ్‌రెడ్డి, నందీప్ దొగ్గల సోమవారం లండన్‌లో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. - కరీంనగర్ కార్పొరేషన్

టెట్ పరీక్షలపై 'నెట్' ఎఫెక్ట్

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటి టెస్ట్(నెట్) పరీక్ష ప్రభావం పడనుంది. అటు టెట్.. ఇటు యూజీసీ నెట్ రెండు పరీక్షలు ఒకే తేదీల్లో జరగనున్నాయి. దీంతో టెట్‌ను వాయిదావేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. టెట్ నోటిఫికేషన్ నవంబర్ 7న విడుదల కాగా, పరీక్షలను జనవరి 1 నుంచి 20 వరకు నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. ఇటీవలే యూజీసీ నెట్ నోటిఫికేషన్ సైతం విడుదలైంది. డిసెంబర్ 11 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఈ పరీక్షలను జనవరి 1 నుంచి 19 వరకు నిర్వహిస్తామని యూజీసీ ప్రకటించింది.

'విద్యార్థుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం'

ముషీరాబాద్, డిసెంబర్ 2: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడువక ముందే 85 వేల కోట్ల అప్పు చేసిందని, కనీసం ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల ఉసురు తీస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆరోపించారు. 16.75 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని, గందరగోళంగా మారిన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో విద్యార్థులతో కలిసి మహాదీక్ష చేపట్టారు.

అది బూటకపు ఎన్‌కౌంటర్

- హైకోర్టులో మృతుడి భార్య పిటిషన్
- రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలి
- మృతదేహాలను భద్రతపరచండి
- హైకోర్టు ఆదేశం.. నేడు విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పూలకొమ్మ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని పేర్కొంటూ హైకోర్టులో అత్యవసర లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలైంది. ఆహారంలో విషం కలిపి మట్టుబెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. విషాహారం భుజించిన మావోయిస్టులను పోలీసులు పట్టుకొని చిత్రహింసలకు గురిచేశారని, ఆ తర్వాత ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మల్లయ్య భార్య కే ఐలమ్మ అలియాస్ మీనా దాఖలుచేసిన ఈ పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారణకు చేపట్టింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం తమ వాదనలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈలోగా ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను ఏటూరునాగారం పీహెచ్‌సీలో భద్రపర్చాలని పోలీసులను ఆదేశించింది. మృతదేహాలను చూసేందుకు పిటిషనర్‌ను, మృతుల రక్తసంబంధీకులను అనుమతించాలని ఏటూరునాగారం ఎస్‌హెచ్‌వోకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారంపై మంగళవారం సమగ్ర విచారణ చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి తెలిపారు.

ముమ్మాటికీ హత్యలే!

విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది డీ సురేశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న పిటిషనర్ మీనా పోలీసులకు ఈ-మెయిల్ పంపారని, తన భర్త మృతదేహానికి తన సమక్షంలో ఇంక్వెస్ట్ (సంఘటన స్థలంలో వాస్తవాల పరిశీలన) చేసి పోస్టుమార్టం నిర్వహించాలని కోరారని వివరించారు. దీనిని ములుగు పోలీసులు పట్టించుకోలేదని అన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 196 (5)ను పోలీసులు ఉల్లంఘించారని తెలిపారు. మృతుల కుటుంబంలో ఎవరికైనా ఇంక్వెస్ట్ బృందంలో భాగస్వామ్యం కల్పించాలని చెప్పారు. నక్సల్స్ తినే ఆహారంలో పోలీసులు విషం, మత్తుమందులు కలిపారని, ఆ తర్వాత వారు స్పృహతప్పి పడిపోయారని వివరించారు. అప్పుడు పోలీసులు వారిని అడుపులోకి తీసుకుని హత్య చేశారని చెప్పారు. విషాహారం కూడా పోలీసులే మావోయిస్టులకు చేరేలా చేశారని అన్నారు. మృతుల్లో ఒకరి చేతిపై యాసిడ్‌తో కాలినగాయాలు ఉన్నాయని, దుస్తులపై తెల్లటి పొడి ఉన్నదని తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని గుర్తుచేశారు. ఇక్కడ కేసు దర్యాప్తునకు మావోయిస్టుల మృతదేహాలు ఎంతో కీలకమని చెప్పారు. పోలీసులు హడావుడిగా రాత్రికి రాత్రే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలకు దహనసంస్కారాలు పూర్తిచేయాలని చూస్తున్నారని తెలిపారు. ఎన్‌కౌంటరే నిజమైతే.. పోలీసులు హడావుడిగా పోస్టుమార్టం ఎందుకు చేయించారని ప్రశ్నించారు. ఫోరెన్సిక్ సైన్స్ వైద్య నిపుణులు ఉన్న వరంగల్‌లోని ఎంజీఎంకు మృతదేహాలను తరలించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. మృదేహాలకు బంధువుల సమక్షంలో ఇంక్వెస్ట్ జరిగేలా ఉత్తర్వులు ఇవ్వాలని, మృతదేహాలను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి ఎఫ్ఎస్ఎల్ నిపుణులతో కూడిన డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

మృతదేహాలను తరలించడం కుదరదు

పిటిషనర్ వాదనలతో ప్రభుత్వ న్యాయవాది మహేశ్‌రాజ్ విభేదించారు. నిబంధనల ప్రకారమే వైద్య నిపుణుల బృందం పోస్టుమార్టం చేసిందని అన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ల బృందం ఆధ్వర్యంలో పోస్టుమార్టం జరిగిందని తెలిపారు. పోస్టుమార్టం సమయంలో పిటిషనర్ కూడా ఉన్నారని, భర్త మృతదేహాన్ని చూడటానికి పిటిషనర్‌ను అనుమతిచ్చారని తెలిపారు. మృతదేహాలను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించడం సాధ్యం కాదని, శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. మృతదేహాలను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించాలని ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. అయితే, మృతదేహాలను భద్రపర్చాలని ఏటూరునాగారం పోలీసులను ఆదేశించింది. రాతపూర్వకంగా ప్రభుత్వ వివరణ ఇవ్వాలని ఆదేశించిన న్యాయమూర్తి తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

అది ఎన్‌కౌంటర్ కాదు..

అది ఎన్‌కౌంటర్ కాదు. పట్టుకుని చిత్రహింసలు చేసి చంపారు. ముందు నుంచి మాత్రమే నా భర్త శవాన్ని చూపించారు. ఫొటో కూడా తీయనియ్యలేదు. తల బొక్కలు పూర్తిగా అతికి లేదు. ముక్కలు ముక్కలై ఉన్నాయి. వెనుక వైపు శరీరాన్ని చూపించలేదు. కుటుంబ సభ్యులందరికీ మృతదేహాన్ని చూపించాలి. మా ముందే పోస్టుమార్టం చేయించాలని హైకోర్టు నుంచి ఆదేశాలు వచ్చాయి. దీన్ని అమలు చేయాలి. ఫొటో అడిగినందుకు ఇబ్బంది పెట్టారు. అన్నంలో విషంపెట్టి చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. కాళ్లు చేతులు విరగొట్టారు. చేయి కూడా వెనుకకు తిరిగి ఉంది. ఒక మృతదేహంపై కెమికల్ చల్లినల్లగా అయ్యేట్లు చేశారు. ఇది బూటకపు ఎన్‌కౌంటర్. – మీనా, మల్లయ్య భార్య

విషప్రయోగం దుష్ప్రచారమే!

- ఎన్‌కౌంటర్‌లోనే చనిపోయారు : డీజీపీ

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లా ఎదురుకాల్పుల ఘటనలో విషపదార్థాలు ప్రయోగించారనేది ముమ్మాటికీ దుష్ప్రచారమని డీజీపీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. ఆ ఎన్‌కౌంటర్‌లో విషపదార్థాలు ప్రయోగించి మావోయిస్టులు స్పృహ కోల్పోయిన తర్వాత కాల్పులు జరిపారని తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం చేస్తున్న ఆరోపణలను డీజీపీ ఖండించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎన్‌కౌంటర్‌లను వెంటనే ఆపాలి

మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్‌కౌంటర్లను ఆపాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు. ప్రజాప్రభుత్వం పేరుతో ఏర్పడిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్‌కౌంటర్‌లు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్‌కౌంటర్ మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేయాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఎన్‌కౌంటర్ మృతదేహాలకు పోస్టుమార్టం

ఏటూరునాగారం, డిసెంబర్ 2: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక ఎన్‌కౌంటర్ మృతదేహాలకు స్థానిక సామాజిక వైద్యశాలలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వీడియో, ఫొటోగ్రఫీ మధ్య వైద్యుల బృందం పోస్టుమార్టం నిర్వహించింది. మృతిచెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులు, బంధువులు ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు చేరుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు మావోయిస్టుల కుటుంబ సభ్యులను పోలీసులు తమ ఆధీనంలోనే ఉంచుకున్నారు. రాత్రి వరకు పోస్టుమార్టం కొనసాగడంతో కుటుంబ సభ్యులంతా అక్కడే వేచి ఉన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరికి చెందిన ఏగోలపు మల్లయ్య భార్య మీనా, సోదరుడు రాజయ్యతో పాటు బంధువులు అక్కడికి వచ్చి మీడియాతో మాట్లాడారు.

నిరంకుశంగా రేవంత్ సర్కారు

- పౌర హక్కులను అణచివేస్తున్నారు
- ఇదెక్కడి పాలన?ఇదెక్కడి రాజ్యాంగం?
- బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో పౌరహక్కుల నేత నారాయణరావు

హైదరాబాద్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): 'ఏం సాధించారని సంబురాలు చేసుకుంటున్నారు? సంబురాలు చేసుకునే నైతిక హక్కు కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి లేదు. నువ్వు ప్రజల ముందు ముద్దాయివి' అంటూ పౌరహక్కుల సంఘం నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో బూటకపు ఎన్‌కౌంటర్లు పెరిగిపోతున్నాయని, నిజనిర్ధారణ చేయనివ్వకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరంకుశత్వాన్ని ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ఇదెక్కడి నీతి అంటూ పౌర హక్కుల సంఘం జనరల్ సెక్రటరీ ఎన్ నారాయణరావు ప్రశ్నిస్తున్నారు. ములుగు బూటకపు ఎన్‌కౌంటర్లపై 'నమస్తే తెలంగాణ'తో ఆయన మరిన్ని విషయాలు పంచుకున్నారు.

ఏడ